పచ్చదనానికి పెద్దపీట

- ఆహ్లాదకర వాతావరణం కల్పించడమే లక్ష్యంగా..
- ఎంఎన్‌ఆర్ పార్కును ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు



ఎంఎన్‌ఆర్ పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ అమృత

నల్లకుంట: అంబర్‌పేట నియోజక వర్గంలో పరిసరాల పరిశుభ్రత, పచ్చదనానికి పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో హెచ్‌ఎండీఏ నుంచి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించి నియోజకవర్గంలోని అన్ని పార్కుల్లో సుందరీకరణ పనులు చేపట్టినట్లు వివరించారు. రాజకీయాలకు అతీతంగా ఆయా కాలనీల ప్రజల అభిరుచి మేరకు పార్కుల్లో సుందరీకరణ పనులు చేపట్టామన్నారు.

- నల్లకుంట డివిజన్ టీఆర్టీ కాలనీలో నూతనంగా సుందరీకరించిన మోత నాగేశ్వరరావు (ఎంఎన్‌ఆర్) పార్కును సోమవారం స్థానిక కార్పొరేటర్ వై. అమృతతో కలిసి ప్రారంభించారు. హెచ్‌ఎండీఏ నుంచి రూ. 95 లక్షల నిధులు మంజూరు చేయించి ఎంఎన్‌ఆర్ పార్కును సుందరీకరించామన్నారు. వేకువ జామున వృద్ధులు, మహిళలు వ్యాయామం, వాకింగ్ చేయడానికి వీలుగా పార్కులో వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయించి, దానికి రెండు వైపులా గ్రీనరీ, పూల మొక్కలు ఏర్పాటు చేయించామన్నారు. వాకింగ్, వ్యాయామం చేసిన తర్వాత ప్రజలు సేదతీరేందుకు వీలుగా సిమెంట్, ఇనుపబల్లలు ఏర్పాటు చేయించామన్నారు. నియోజకవర్గంలో మొత్తం 12 పార్కుల్లో సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయన్నారు. అసెంబ్లీ ఎన్నికలలోపే
- అన్ని పార్కుల సుందరీకరణ పనులు పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు. పట్టణీకరణల నేపథ్యంలో జనావాసాలు కాంక్రీట్ జంగిల్‌గా మారిపోతున్నాయని, సేదతీరాలనుకునే ప్రజలకు స్వచ్ఛమైన గాలి లభించడం కరువవుతోందన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు సీఎం కేసీఆర్ సూచనలు– ఆదేశాలు, మంత్రి కేటీఆర్ సహకారంతో పార్కుల సుందరీకరణ పనులు చేపట్టామని వివరించారు. పార్కుల అభివృద్ధి, పార్కులను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దడంలో సమర్థవంతంగా కృషిచేసిన హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ అధికారులను ఎమ్మెల్యే ఈ సందర్భంగా అభినందించారు. హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ అధికారులు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, సీనియర్ నాయకులు రవిందర్‌రావు, భూపతినాథ్, పాక చందర్, పులిజాల గెల్వయ్య, గోనే ప్రదీప్‌రావు, భాస్కర్ గౌడ్, ఇర్ఫానా సుల్తానా, బీజేపీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు రమణానాయుడు, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, సీనియర్ నాయకులు ఏవీ. లక్ష్మారెడ్డి, మహేష్, ఎస్. నర్సింగ్‌రావు, ఎంబీ కిశోర్‌కుమార్, వన్నాడి రమ్య, టీఆర్టీకాలనీ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులున్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్‌సీపీడీసీఎల్–11 కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ ప్రకటించారు. చెన్నారెడ్డి నగర్ ఫీడర్ పరిధిలో న్యూ పటేల్‌నగర్, అహ్మద్‌నగర్, సమోస కార్ఖానా, పటేల్‌నగర్, కల్లు కంపౌండ్, బిస్మిల్లా హోటల్, పోచమ్మ దేవాలయం తదితర ప్రాంతాల్లో ఉదయం 10.30 గంటల నుంచి ఒంటి గంట వరకు, బాపునగర్ ఫీడర్ పరిధిలో ఓవైసీనగర్, నెక్లెస్‌హోటల్, ఆకాష్‌నగర్, బాపునగర్ తదితర ప్రాంతాల్లో 11.30 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న బీఆర్ఎస్ నేత దూసరి శ్రీనివాస్‌గౌడ్

అంబర్‌పేట: సీఎం రిలీఫ్‌ఫండ్ పేదల వైద్యానికి భరోసా కల్పిస్తుందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తిలక్‌నగర్‌కు చెందిన ఉమాకు సీఎం రిలీఫ్‌ఫండ్ పథకం ద్వారా మంజూరైన రూ.22 వేల చెక్కును ఆయన సోమవారం గోల్నాకలోని తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మంత్రులు కేటీఆర్, హరీష్‌రావుల సహకారంతో తన వంతు చేయుతను అందిస్తునట్లు వివరించారు.

నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న కార్పొరేటర్ పద్మ

అంబర్‌పేట: పేద విద్యార్థులకు చేయుతనిచ్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్‌లోని బతుకమ్మకుంటలోని ప్రభుత్వ పాఠశాలలో శ్రీనివాసన్ మునిస్వామి రాధా అద్దంకి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ హాజరై విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదివి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని సూచించారు. బీజేపీ నాయకులు రమేష్‌ముదిరాజ్, శ్రీనివాస్, బాలకృష్ణగౌడ్ తదితరులున్నారు.

దళితుడికి సీఎం పదవి ఇవ్వాలి

కాచిగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం పదవిని దళితుడికి కేటాయించాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ డిమాండ్ చేశారు. సోమవారం బర్కత్‌పురలో ఆయన మాట్లాడుతూ.. నేడు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు, రాస్తారోకోలు, 13న బుధవారం అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు, రాస్తారోకోలు ఉంటాయని ప్రకటించారు. కేబినెట్ అంతా 93 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో 90 శాతం అణగారిన వర్గాలకే కేటాయించాలన్నారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

కాచిగూడ: భారతీయ విద్యా భవన్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గల కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీరామ్ తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థినీవిద్యార్థులు అర్హులు. అక్టోబర్ 9వ తేదీలోగా బషీర్‌బాగ్, కింగ్‌కోఠి రోడ్డులోని భారతీయ విద్యా భవన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అక్టోబర్ 16 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. వివరాలకు 040–23241629, 8309308952.

మద్యం మత్తులో యువకుడిపై దాడి

కాచిగూడ: తాగిన మైకంలో ముగ్గురు స్నేహితులు ఓ యువకుడిపై కత్తితో దాడి చేయడంతో ఆ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతానికి చెందిన విశాల్ (23), కాచిగూడకు చెందిన మదర్ (35), కైలాస్ కుమార్ (30) లు ముగ్గురు స్నేహితులు. కాచిగూడలోని ఓ వైన్స్ సిట్టింగ్ రూమ్‌లో కలిసి మద్యం తాగుతున్నారు. ఈ క్రమంలో నారాయణగూడ విఠల్‌వాడికి చెందిన శ్రీనివాస్ (28) అదే వైన్స్‌కు వచ్చి పక్క టేబుల్‌పై కూర్చొని మద్యం సేవిస్తున్నాడు. తాగిన మైకంలో ఉన్న ముగ్గురు పక్కటేబుల్‌పై ఉన్న వ్యక్తితో గొడవపడ్డారు. మాటమాట పెరగడంతో విశాల్ వద్ద ఉన్న కత్తితో ముగ్గురు కలిసి అతడిపై దాడి చేసి పరారయ్యారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సుభాష్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణను విస్మరించడం సరికాదు



రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ముషీరాబాద్: 'ఎస్సీ వర్గీకరణను విస్మరించడం అంటే సామాజిక న్యాయాన్ని సమాధి చేయడమేనని' మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి రాగళ్ల ఉపేందర్ మాదిగ అన్నారు. సోమవారం నియోజకవర్గ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ముషీరాబాద్ ఎంఆర్‌వో కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ నెల 18 నుంచి 22 వరకు కొనసాగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలల్లోనే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపేందర్ మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంటు సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ చేయకపోతే బీజేపీ పార్టీ మాదిగల పట్ల ప్రధాన దోషిగా చరిత్రలో నిలిచిపోతుందని ఆరోపించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ మాదిగ, ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ కవాడిగూడ డివిజన్ ఇన్‌చార్జి బుర్ర జగదీశ్‌మాదిగ, సీనియర్ నాయకులు శ్యామ్‌రావు మాదిగ, ఎల్లయ్య, నర్సింగ్, దశరథ్ తదితరులున్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి

కాచిగూడ: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఈస్ట్‌జోన్ డీసీపీ సునిల్‌దత్ అన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మండపాల నిర్వహకులు మండపాల వద్ద సత్ప్రవర్తన కలిగిన యువకులను వాలంటీర్లుగా నియమించాలన్నారు. సెంట్రల్ పీస్ కమిటీ ఈస్ట్‌జోన్ అసిస్టెంట్ సెక్రటరీ ఎస్.శరత్ శ్యామ్ ఆధ్వర్యంలో ప్రతినిధులు సోమవారం ఈస్ట్‌జోన్ డీసీపీ సునిల్‌దత్‌ను వినాయకచవితి వేడుకల సందర్భంగా కలిసి అభినందించారు. వినాయకచవితి, మిలాద్ ఉన్‌నబి వేడుకల ఏర్పాట్లపై డీసీపీతో చర్చించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ఆకతాయిలు, సంఘ విద్రోహక శక్తులపై నిర్వాహకులు జాగ్రత్తగా ఉండాలన్నారు. వాహనాల రాకపోకలు, ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాల ఏర్పాటుకు వివిధ శాఖల నుంచి అనుమతి తప్పనిసరని పేర్కొన్నారు. అడిషనల్ డీసీపీ కె.పృథ్వీధర్‌రావు, కాచిగూడ ఏసీపీ కస్తూరి శ్రీనివాస్, సెంట్రల్ పీస్ కమిటీ అధ్యక్షుడు ఎస్. నారాయణరెడ్డి, ఖాలీద్, బసంతి కౌర్, మధుసూదన్, రమణరావు తదితరులున్నారు.

చిక్కడపల్లి: గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని చిక్కడపల్లి ఏసీపీ ఏ.యాదగిరి గణేష్ మండపాల నిర్వాహకులకు సూచించారు. సోమవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చిక్కడపల్లి డివిజన్ (చిక్కడపల్లి, ముషీరాబాద్) పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలను తప్పకుండా పాటించాలన్నారు. ఇతర వాహనదారులు, అంబులెన్స్‌లు వెళ్లేలా దారి విడిచి రోడ్డు పక్కన మండపాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాత్రి సమయంలో ముగ్గురు నిర్వాహకులు ఉండాలని, రాత్రి 10గంటల వరకే స్పీకర్‌లకు అనుమతి ఉందన్నారు. నిమజ్జన శోభాయాత్రను సాయంత్రం లోపే ముగించాలని, డీజేలకు అనుమతి లేదని వివరించారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్, ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్ యాదవ్, డీఐ వెంకటరెడ్డి, పలు సూచనలు చేశారు. చిక్కడపల్లి అడ్మిన్ ఎస్సై నాగరాజు, ఎస్సైలు అభిలాష్, కోటేశ్వర్‌రావు, శశిపాల్‌రెడ్డి, ముషీరాబాద్ ఎస్సైలు ప్రసాద్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, స్వప్న, లక్ష్మణ్, చలపతి సిబ్బంది ఉన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్: డ్రైనేజీ, సీసీరోడ్ల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం స్థానిక నేతల విజ్ఞప్తి మేరకు కవాడిగూడ డివిజన్ పరిధిలోని సింగాడి కుంట, ముగ్గ బస్తీ, ఉన్నికోట తదితర బస్తీల్లో జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే డివిజన్‌లో దీర్ఘకాలిక సమస్యలైన డ్రైనేజీ, బస్తీల్లో వీడీసీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. అవసరమైన చోట నూతన డ్రైనేజీ పైపులైన్లు, రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. బీఆర్ఎస్ యువ నాయకులు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షులు వల్లాల శ్యామ్‌యాదవ్, వల్లాల శ్రీనివాస్‌యాదవ్, ముచ్చకుర్తి ప్రభాకర్, మాధవి, జునేద్‌బాగ్దాదీ తదితరులున్నారు.

అన్ని నియోజకవర్గాల్లో ఆప్ పోటీ

ముషీరాబాద్: ఆమ్‌ఆద్మీ పార్టీ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలోని అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తుందని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. సోమవారం లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 24న హైదరాబాద్‌లో ఆప్ వాలంటరీల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్, ప్రజా వ్యతిరేక విధానాలు, అవినీతి పాలన, నిరుద్యోగం, వివిధ ఆహార పదార్థాలపై జీఎస్టీ విధించడం వంటి మౌలిక సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఆప్ తెలంగాణ కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాముగౌడ్, ఎండీ మసీద్, డాక్టర్ పాండురంగయ్య, దివ్యాంగ కమిటీ అధ్యక్షుడు దర్శనం రమేష్, అధికార ప్రతినిధి ప్రవీణ్‌యాదవ్, నాయకులు సలావుద్దీన్ తదితరులున్నారు.



సినీనటి హేమ జిల్లోజ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సుధాకర్

'సరైన ఆలోచనలతోనే ఘన విజయాలు'



మాట్లాడుతున్న బ్రహ్మకుమారి డాక్టర్ శ్యామల, శోభ

కాచిగూడ: ఆలోచన, ప్రవర్తన సరళిలో చిన్నమార్పు చేసుకుంటే ఘన విజయాలు సాధించవచ్చని బ్రహ్మకుమారి డాక్టర్ శ్యామల, శోభ అన్నారు. సోమవారం బర్కత్‌పురలోని అవంతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బ్రహ్మ కుమారి సమాజం తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో 'ఎంపవరింగ్ ద ఫ్యామిలీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మనిషి సమస్యలను అధిగమించడానికి సంఘర్షణల నుంచి పరిష్కారం కోసం మెరుగైన మార్గాలు నేర్చుకోవాలని సూచించారు. ఒక్కోసారి మనలో మనకు అవగాహన, శ్రద్ధ, మద్దతు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతుంటామన్నారు. అలాంటి సమయంలో యోగా, ధ్యానం చేయడం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. శాంతి, ఓర్పు, విషయపరిజ్ఞానం మనిషి ఎదుగుదల, కుటుంబ ఎదుగుదలతో పాటు సమాజానికి పునాదులని పేర్కొన్నారు. విశ్రాంత ఓయూ ప్రొఫెసర్ బుచ్చయ్య, లక్ష్మారెడ్డి, అవంతి కళాశాల హెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ జయప్రద, మాధవి తదితరులున్నారు.

సర్టిఫికెట్ల ప్రదానం

– ఈ నెల 15 నుంచి 19వ బ్యాచ్ శిక్షణా తరగతులు ప్రారంభం



మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న దృశ్యం

నల్లకుంట: శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, కోటి సమితి హైదరాబాద్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా నిర్వహిస్తున్న టైలరింగ్ 18వ బ్యాచ్ శిక్షణ తరగతులు ముగిశాయి. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సోమవారం నల్లకుంట శివం ప్రాంగణంలో కాన్వొకేషన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శర్మద టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న 14 మంది మహిళలకు సర్టిఫికెట్లను అందజేసి మాట్లాడారు. ఇప్పటి వరకు 450 మందికి పైగా మహిళలు కుట్టు శిక్షణ పూర్తి చేసుకుని స్వయం ఉపాధిని పొందుతున్నారన్నారు. ఈ అవకాశాన్ని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 88865 09410.

ప్రజల సహకారంతోనే నేరాలు అదుపు



ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో పాల్గొన్న నల్లకుంట సీఐ జగదీశ్వర్‌రావు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజల సహకారంతోనే నేరాలు అదుపులో ఉంటాయని నల్లకుంట సీఐ జగదీశ్వర్‌రావు అన్నారు. సోమవారం పద్మాకాలనీలో ఫ్రెండ్లీ పోలీస్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ.. ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు, ప్రజలకు ఇబ్బందులు కలిగినా తమకు సమాచారం అందించాలని కోరారు. ప్రజలకు ఎప్పుడూ.. తాము అందుబాటులో ఉంటామన్నారు. పోలీసులతో ప్రజలు స్నేహితులుగా మెలిగి, చట్టపరంగా సహకరించాలని కోరారు. పద్మకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రితీష్, సాయి, వినోద్, సునీత్, శ్రీకాంత్, బాలకృష్ణారెడ్డి, రేపా, సుష్మిత తదితరులున్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందాడు. కాచిగూడ రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం నెంబర్ 5 పై ఓ గుర్తుతెలియని వ్యక్తి (60) మృతదేహం లభ్యమైంది. పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలి



ఉచిత పంపిణీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఈ పరంజ్యోతి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని హెచ్‌ఎండీఏ ఎస్ఈ పరంజ్యోతి అన్నారు. బాగ్‌లింగంపల్లిలో హెచ్‌ఎండీఏ, హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల ఉచిత పంపిణీ పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణానికి హానిచేయని మట్టి వినాయకులను ప్రతిష్ఠించి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ ఏడాది లక్ష మట్టివినాయకులను ఉచితంగా పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రధాన కూడళ్లు, పార్కులు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రత్యేక కౌంటర్ల ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి కె.వీరయ్య, ఉపాధ్యక్షులు బీ.ఎన్.సుదర్శన్, సంయుక్త కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌రావు, నాగేశ్వర్‌రావు, శ్రీనివాసరావు, సుకుమార్ తదితరులున్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్య ప్రదర్శన



పురస్కార గ్రహీతలతో దైవజ్ఞశర్మ

చిక్కడపల్లి: నటరాజ్ అకాడమీ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో నాట్యోహం పేరిట శాస్త్రీయ నృత్య ప్రదర్శన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గురు, శిష్యులు, తల్లిదండ్రులకు నాట్య బంగారు వజ్ర నంది పురస్కారం–2023 పేరిట పురస్కారాలను బహుకరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దైవజ్ఞశర్మ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమాలకు తోడు కళాసంస్థలు, సాంస్కృతిక సంఘాలు చేస్తున్న కార్యక్రమాలతో రాష్ట్రంలో సాంస్కృతిక రంగం పరిఢవిల్లుతోందని అభిప్రాయపడ్డారు. విద్యావేత్త శ్రావణ్‌కుమార్, నిర్వాహకులు నల్లగిరి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడిపై కత్తితో దాడిచేసిన వ్యక్తి రిమాండ్

చిక్కడపల్లి: అకారణంగా తన స్నేహితుడిపై కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన వ్యక్తిపై దోమలగూడ పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం దోమలగూడ సీఐ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దోమలగూడ గగన్‌మహల్ హెల్త్ సెంటర్‌కు తన స్నేహితుడు గంట వెంకటేష్‌కు తలకు గాయం అయ్యిందని చెప్పి ఆసుపత్రిలో డ్యూటీలో ఉన్న నర్సు ద్వారా ఆదివారం ఉదయం మందులు తీసుకుని వేసుకుంటుండగా.. నాగార్జున తనతో వెంట తీసుకొచ్చిన కొబ్బరిబోండా కత్తితో అతడి తలపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. దాదాపు గంట సేపు ఆసుపత్రిలో నిందితుడు గదిలో గడియ పెట్టుకొని ఇబ్బంది పెట్టాడు. నిందితుడిని పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి తీవ్ర గాయాలైన బాధితుడు వెంకటేష్(34)ను పోలీసులు గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. నిందితుడిపై హత్యాయత్నం, పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు.

సమాజంలో చిచ్చుపెట్టేందుకు కుట్ర



రాంనగర్ చౌరస్తాలో..



నిరసన కార్యక్రమంలో కార్పొరేటర్ అమృత

కాచిగూడ: సనాతన ధర్మంపై దాడికి వ్యతిరేకంగా బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం బర్కత్‌పుర చౌరస్తాలో పార్టీనేతలు, కార్యకర్తలు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్ మాట్లాడుతూ సనాతన ధర్మంపై తమిళనాడు రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అధికార మదంతో ప్రశాంతంగా ఉన్న సమాజంలో చిచ్చు పెట్టేందుకు కొంతమంది చేస్తున్న కుట్రలు మానుకోవాలని డిమాండ్ చేశారు. ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సనాదన ధర్మంపై ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు చాలా దుర్మార్గమని ఆమె విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, ఏ.సూర్యప్రకాష్ సింగ్, సి.నందకిషోర్ యాదవ్, సుభాష్ పటేల్, చిట్టి శ్రీధర్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, ఆర్.సంతోష్, ఎం.ఆనంద్‌రావు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

అంబర్‌పేట: సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేసే వ్యక్తుల పట్ల ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం మహాత్మజ్యోతిరావు పూలే విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉదయనిధి స్టాలిన్‌ను అరెస్టు చేయాలంటూ.. ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. బీజేపీ నాయకులు యశ్వంత్, ఆనంద్‌గౌడ్, భిక్షపతి, కృష్ణముదిరాజ్, యాదగిరి తదితరులున్నారు.

- బాగ్‌అంబర్‌పేటలో జరిగిన నిరసనలో అజయ్ కుమార్, అచ్చిన రమేష్, గోవర్ధన్‌రెడ్డి, రాజు, ఎల్.శ్రీనివాస్ తదితరులున్నారు.

ముషీరాబాద్: సనాతన ధర్మం అంటే మానవ మేధ ఎలా ఉండాలో చేప్పేదని అది ఒక వేద ధర్మమని ముషీరాబాద్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్ అన్నారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని తమిళనాడు రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ.. బీజేపీ ముషీరాబాద్ అసెంబ్లీ కమిటీ ఆధ్వర్యంలో రాంనగర్ చౌరస్తాలో సోమవారం ధర్నా నిర్వహించారు. అసెంబ్లీ కో–కన్వీనర్ నవీన్‌గౌడ్, రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి, రాష్ట్ర నాయకులు సీ.కె.శంకర్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు సలంద్రి శ్రీనివాస్, అరుణ్‌కుమార్, ఆర్.నరేష్, సూర్యనారాయణశర్మ, జమాల్‌పూర్ నందు, సుబ్రహ్మణ్యం, పద్మజ, రత్నసాయిచంద్, దర్గనర్సింగ్‌రావు, రాజు తదితరులున్నారు.

ఫీవర్ చౌరస్తా వద్ద..

నల్లకుంట: సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయనిధి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ నేతలు సోమవారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు. కార్పొరేటర్ అమృత, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రమణానాయుడు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



నిరసనలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు తదితరులు